విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నుల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, బాక్సులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కృష్ణారావు హాజరై అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, శ్యామల రాజు, సుధీర్, రాము, కృష్ణంరాజు, సంతోష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలి



లీకేజీ సమస్యను అధికారులతో కలిసి పరిశీలించిన కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ మెయిన్ రోడ్డు వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీతో గుంతలు ఏర్పడి నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో బుధవారం వాటర్‌వర్క్స్ డీసీఎం, జీహెచ్‌ఎంసీ అధికారులతో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. లీకేజీ, రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం నాగప్రియ, అధికారులు ఏఈ రాజీవ్, వాటర్ లైన్‌మెన్ శ్రీకాంత్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ మహా పడిపూజ



పూజలో ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, భక్తులు

మూసాపేట: పరమేశ్వరి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని శ్రీహరిహర క్షేత్ర దేవస్థానం పాలక మండలి చైర్మన్ డాక్టర్ నాగిరెడ్డి అన్నారు. భరత్‌నగర్ శ్రీహరిహర క్షేత్ర ఆలయ ప్రాంగణంలో కోహిర్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివ మహాపడిపూజ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, జగదీష్, సంజీవరెడ్డి, రమేష్, వికే రావు, నాగరాజు, ఆంజనేయ చారి, వేణు, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమ లింగప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సర్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్, జేవెన్ హైట్స్ అపార్టుమెంట్, కేపీహెచ్‌బీ 7వ ఫేజ్, కేపీహెచ్‌బీ వాటర్ వర్క్స్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఎస్. రాకేష్ కుమార్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ హ్యుందయ్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెరిడియన్ స్కూల్ ప్రాంతం, ఎస్ కన్వెన్షన్ లైన్, బుట్ట కన్వెన్షన్ రోడ్డు, ఎస్‌బిఎ ప్రాంతంలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నిషేధిత డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

కుత్బుల్లాపూర్: మత్తు పదార్థాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పేట్‌బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం సయ్యద్‌నగర్‌లోని కట్టమైసమ్మ ఆలయం సమీపంలో పేట్‌బషీరాబాద్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. టీఎస్08జీఎస్ 4738 స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీలు చేయగా.. వారి వద్ద 32 గ్రాముల ఎండీఎంఏ నిషేధిత డ్రగ్స్ పట్టుబడ్డాయి. నిందితులను సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని భాగ్యలక్ష్మికాలనీకి చెందిన రాకేష్‌కుమార్ బిష్ణోయ్(20), సురేష్‌కుమార్ బిష్ణోయ్(24)లుగా గుర్తించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వీరిద్దరు గత కొంతకాలంగా నిషేధిత డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.



కలుషిత జలాలతో అంబీర్ చెరువు



అంబీర్ చెరువును కాపాడాలని ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు(ఫైల్)

అంబీర్ చెరువుకు ఆధునికీకరణేది?

- డ్రైనేజీ నీటితో దుర్గంధం
- పేరుకుపోయిన గుర్రపుడెక్క
- డంపింగ్ కేంద్రంగా చెరువు పరిసరాలు
- చెరువును సంరక్షించాలని సేవ్ అంబీర్ చెరువు పేరిట నిరసనలు



చెరువులోని గుర్రపు డెక్క

నిజాంపేట్: అంబీర్ చెరువు అంటే తెలియని వారు ఉండరు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ రావాలంటే చెరువు మధ్యలో నుంచి ఉన్న రోడ్డు మార్గానే రావాలి. ఈ రోడ్డుకు ఇరు వైపులా చెరువు ఎంతో అందంగా ఉంటుంది. అంతే కాకుండా చెరువుకు నిజాంపేట్ వైపు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. రెండు వైపుల బతుకమ్మ ఘాట్‌లు ఉన్నాయి. ఇలా చెరువును ఓ మినీ ట్యాంక్ బండ్‌లా మార్చుకోవాలన్న స్థానికులకు నిరాశ తప్పడం లేదు. చెరువు పరిసర ప్రాంతాల్లో నివసించే వేలాది కుటుంబాలు నిత్యం ఇక్కడి కాలుష్య జలాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

> వర్షపు నీటితో కళకళలాడిన అంబీర్ చెరువు నేడు కలుషిత నీటితో విషసాగరంగా మారింది. ఇటు శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని పలు కాలనీల నుంచి డ్రైనేజీ నీరు మొత్తం అంబీర్ చెరువులో కలిసి కలుషితమైంది. చెరువును ఆహ్లాదంగా మార్చుకునేందుకు స్థానికులు వివిధ రూపాల్లో తమ నిరసనలు కొనసాగిస్తున్నారు. ప్రగతినగర్, నిజాంపేట్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో అంబీర్ చెరువు చాలా పెద్దది. సుమారు 270 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సిన చెరువు ప్రస్తుతం అనేక ఆక్రమణల తరువాత వంద ఎకరాల వరకు విస్తీర్ణం తగ్గి ఉండవచ్చునని అధికారుల అంచనా. ఇకనైనా అధికారులు చెరువులో డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు తీసుకొని ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని పరిసర ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విషసాగరంగా..

అంబీర్ చెరువులో హైదర్ నగర్, నిజాంపేట్, ప్రగతినగర్ తదితర ప్రాంతాలలోని సుమారు 15 కాలనీ నుంచి డ్రైనేజీ నీరు ఇందులో చేరుతుంది. హైదర్‌నగర్ వైపు నుంచి చెరువులో డ్రైనేజీ నీరు కలువకుండా పైపులైన్లు వేశారు. కానీ ఇటు ప్రగతి నగర్ వైపు మాత్రం డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు తీసుకోకపోవడంతో చెరువు మొత్తం కలుషితమైంది. దీంతో చెరువు మొత్తం గుర్రపు డెక్కతో దుర్గంధ భరితంగా మారింది.

చెరువులోనే చెత్త, ఇతర వ్యర్థాలు

అంబీర్ చెరువు మధ్యలో నుంచి రోడ్డు ఉండటంతో ఈ ప్రాంతం ఓ మినీ ట్యాంక్ బండ్‌ల ఉంటుంది. దీంతో చెరువుపై ప్రతి రోజు మాంసపు దుకాణాలు ఉంటాయి. ఇక ఆదివారం, పండుగల సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా చెరువులోనే చెత్త వేయడం, మాంసపు వ్యర్థాలు సైతం చెరువులోనే పడేస్తున్నారు. ఇతర వ్యాపారులు సైతం చెరువును డంపింగ్ యార్డుగా మార్చుకోవడంతో చెరువు మొత్తం కలుషిత జలాలతో కంపు కొడుతోంది.

జీహెచ్‌ఎంసీ, కార్పొరేషన్‌ల మధ్య సమన్వయ లోపం

అంబీర్ చెరువు జీహెచ్‌ఎంసీతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ల మధ్యలో ఉంటుంది. చెరువుకు జేఎన్‌టీయూ వైపు జీహెచ్‌ఎంసీ, ప్రగతి నగర్ వైపు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లు బాధ్యతగా ఉన్నాయి. చెరువు విషయంలో ఇరు ప్రాంతాల అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తుంది. ఎవరికి వారు తమ పరిధి కాదని బాధ్యతల నుంచి తప్పుకుంటూ చెరువు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విషజ్వరాల బారిన పరిసర ప్రజలు

చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. చెరువులోని కలుషిత జలాలతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం అయ్యిందంటే చాలు ఇంటి తలుపులు తీయాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సేవ్ అంబీర్ చెరువు పేరుతో..

అంబీర్ చెరువును కాపాడాలని కోరుతూ కొంత కాలంగా స్థానిక ప్రజలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను కలుస్తూ సమస్య తీవ్రతను వివరిస్తున్నారు. ప్రజలను చైతన్యం చేసి అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో ర్యాలీలు నిర్వహిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ వంతు బాధ్యతను ప్రజలు నిర్వర్తిస్తున్నారు.

డిజిటల్ బోర్డుతో పాఠాలు బోధించాలి

డీఈఓ విజయకుమారి



మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

బాలానగర్: డిజిటల్ బోర్డు ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయుల పాఠాలు బోధించాలని డీఈఓ విజయకుమారి అన్నారు. బాలానగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఐఎఫ్‌పీ శిక్షణ కార్యక్రమానికి ఆమె బుధవారం హాజరై మాట్లాడారు. పాఠశాలలో ఐఎఫ్‌పీలను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టుల్లో డిజిటల్ బోర్డు వినియోగంపై తగిన నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. తరగతి గదిలో ప్రతి రోజూ లాగిన్‌తో విద్యార్థులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కూకట్‌పల్లి: మల్టీప్లెక్స్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సినిమా థియేటర్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం నెక్సస్ మాల్‌లో పీవీఆర్ ఐనాక్స్ డ్యూటీ మేనేజర్ మహేందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ మందితో పని చేయించడం వల్ల ఉన్న వారిపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శంకర్, మల్లేష్, ఎన్ మారన్న, అరుణ్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ కళాశాలలో సందడిగా ఫేర్‌వెల్ డే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కో ఎడ్యుకేషన్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ జి. భాస్కర్ రావు, ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ తిరుమల రావు హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్‌లు మధుసూదన్ రావు, అరవింద్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్‌లు పద్మప్రియ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్ నగర్ సీ బ్లాక్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం జీహెచ్‌ఎంసీ ఏఈ రంజిత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీలైనంత తొందరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల చోరీ

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌బీఎస్ నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో దొంగలు పడ్డారని బస్తీ నాయకులు తెలిపారు. బుధవారం ఉదయం గుడికి భక్తులు రాగా.. రాముడు, సీత, లక్ష్మణుల ఉత్సవ మూర్తి విగ్రహాలు, హనుమంతుని వెండి విగ్రహం, హుండీలోని డబ్బులు దొంగిలించారని గమనించారు. ఈ మేరకు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆహారంలో మిల్లెట్స్ భాగమవ్వాలి

ఐసీఏఆర్–ఐఐఎంఆర్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి



డైరెక్టర్ తారా సత్యవతికి జ్ఞాపికను అందిస్తున్న వీసీ ప్రొ. ఐనుల్ హసన్

రాయదుర్గం: ప్రతిరోజూ అందరూ మిల్లెట్స్ తినే అలవాటు చేసుకోవాలని ఐసీఏఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ సి. తారాసత్యవతి సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్‌ఐనుల్ హసన్ అధ్యక్షతన సుస్థిర అభివృద్ధి కోసం మొక్కలు–మానవ పరస్పర చర్యలు' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవాలన్నారు. వైస్‌చాన్స్‌లర్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ జీవితంలో మొక్కల ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ మక్బూల్ అహ్మద్, కన్వీనర్ డాక్టర్ ఇరాఖాన్ మాట్లాడుతూ స్థిరమైన మానవాభివృద్ధిలో మొక్కలు కీలకమన్నారు. డీన్ ప్రొ.అలీమ్ బాషా, ప్రొఫెసర్లు ఫజల్‌ఉర్ రహమాన్, పర్వీన్ జహాన్ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు 'అబ్‌స్ట్రాక్ట్ పుస్తకం, గఫూర్ అన్ నిసా రచించిన ఫ్లోరా పుస్తకాన్ని ఆవిష్కరించారు.

భారతీయ విద్యా వ్యవస్థకు ప్రాధాన్యం ఉంది

'మనూ' వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్



సదస్సులో పాల్గొన్న అతిథులతో వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: నైతిక విలువల ఆధారిత విద్య కారణంగా భారతీయ విద్యావ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ, ఎంఎంటీటీసీ, ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్, బీహెచ్‌యూ, వారణాసి, యూపీ, లెర్న్ టు లీడ్ సంస్థ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత మేధస్సు, దాని శక్తి ప్రాముఖ్యతను గుర్తించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యావేత్తల అవసరాన్ని గుర్తించాలన్నారు .న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంటల్ స్టడీస్ గౌరవ ఆచార్యుడు వి సుధాకర్ మాట్లాడుతూ మానవ ఆలోచనలను శక్తివంతం చేయడంలో సాంకేతిక ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జేవి మధుసూదన్, డాక్టర్ రావుల కృష్ణయ్య ,ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు ప్రసంగించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయానికి వివిధ బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాలు అందజేశారు. రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ పైపులైన్‌లు వేయాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

◆ గాజులరామారం డివిజన్ పరిధి ఇంద్రానగర్–ఏ లోని పోచమ్మ ఆలయం 9వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.



పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

16న పోచమ్మ తల్లి ఆలయ మహోత్సవం

నిజాంపేట్ : కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 1, 3లో పోచమ్మ తల్లి ఆలయ 3వ వార్షిక వేడుకలు ఈ నెల 16న జరుగనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. 16న ఉదయం 6:15 గంటలకు లక్ష్మీ గణపతి హోమం, 7:45 గంటలకు పంచామృతం, అష్టఫలాల అభిషేకం, 9 గంటలకు అమ్మవారి అలంకరణ, అమ్మవారి దర్శనం ఉంటుందని తెలిపారు. అనంతరం 1:15 గంటలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో అష్టలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేష్ ముదిరాజ్ రూ.50 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోచిన సాయం అందించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.విష్ణువర్ధన్‌రావు, పి.రాంబాబు, సీహెచ్ లింగయ్య, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు..

రోడ్లు, ఫుట్‌పాత్‌లు తిరిగి ఆక్రమిస్తే చర్యలు: అధికారులు



మియాపూర్ జాతీయ రహదారి ఇరువైపులా ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది

మియాపూర్: చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్ మెట్రోస్టేషన్ నుండి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలను బుధవారం జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. జాతీయ రహదారిపై ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయంతో బాటు పాదచారులు రోడ్డుపై నడుస్తున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఇటీవల సాక్షి దినపత్రికలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారం–ట్రాఫిక్ సమస్య అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మియాపూర్ జాతీయ రహదారి ఇరువైపులా, మియాపూర్–బొల్లారం రోడ్డులోని ఫుట్‌పాత్ ఆక్రమణలను మియాపూర్ పోలీసుల బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి పర్యవేక్షణలో జేసీబీ సహాయంతో ఆక్రమణలను తొలగించారు. డబ్బాలు, తోపుడు బండ్లు, షెడ్లు, ఫర్నీచర్ దుకాణాలను తొలగించారు. వారం రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న ఫర్నీచర్ దుకాణాలను తీసి వేయాలని నిర్వాహకులకు సూచించారు. రోడ్డు, ఫుట్‌పాత్‌లను తిరిగి ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో మియాపూర్ సీఐ క్రాంతికుమార్, ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

